# ఆకాంక్ష

"జీవితంలో అన్నింటికంటే ప్రేమ
గొప్పది కావచ్చు కానీ ప్రేమే జీవితం కాకూడదు"



# ఆకాంక్ష

"జీవితంలో అన్నింటికంటే ప్రేమ గొప్పది కావచ్చు
కానీ ప్రేమే జీవితం కాకూడదు"



రచన - శైలి

# ఆకాంక్ష

డాబా మీద అటు ఇటు తిరుగుతూ చదువుకుంటున్న ఆకాంక్ష క్రింద నుంచి ఎవరో పిలుస్తున్నట్టుగా అన్పించి అటుగా చూసింది. అంతే... చేతిలో వున్న బుక్ కోపంతో విసిరికొడుతూ మొహం చిట్లించుకుని త్వరత్వరగా క్రిందకి వెళ్ళిపోయింది.

ఆమె లోనికి వెళ్ళిన మరుక్షణం రోడ్‌పై వున్న ఆ పర్సన్ కూడా జారుకున్నాడు. రోజూ ఇదంతా జరిగే సీనే అయినా ఏ రోజుకారోజు అసహ్యంతో రగులుకుపోతుంటుంది ఆకాంక్ష.

అన్నయ్య ప్రక్కన కూర్చుని టి.వి.లో వచ్చే కార్టూన్ షో యమ సీరియస్‌గా చూడసాగింది. మనసులో మాత్రం అసహనంగా ఉంది. ఆ వ్యక్తి గురించిన ఆలోచన వస్తే చాలు తలంతా విపరీతమైన నొప్పి మొదలవుతుంది.

ఈ సమస్య ఎవరికీ చెప్పుకోలేనిది. అలాగని ఒంటరిగా భరించలేనిది. ఏం చేయటానికి పాలుపోక తదేకంగా టి.వి.నే చూడసాగింది.

ఇంతలో అటుగా వచ్చిన ఆమె తల్లి శారద ఆశ్చర్యంగా ఆకాంక్షను చూస్తూ "అదేంటి బుజ్జీ! ఎగ్జామ్స్ దగ్గరకొస్తుంటే చదవటం మాని టి.వి. చూస్తున్నావ్...! ముందు బుక్ తియ్" అంటూ మందలించింది.

అప్పటిగ్గానీ తన ఇంగ్లీష్ నోట్స్ విసిరి కొట్టానన్న విషయం జ్ఞాపకానికి రాలేదు. స్పృహలోకొచ్చిన ఆకాంక్ష పరుగున వెళ్ళి విసిరికొట్టిన బుక్ తెచ్చుకుని ఆప్యాయంగా చూసుకుంది. అనాలోచితంగా బుక్ విసిరి కొట్టినందుకు సరస్వతికి క్షమాపణ చెప్పుకుంది.

అంతే మరిక ఏ విషయం ఆలోచించకుండా తన బెడ్‌రూమ్ కెళ్ళి చదువుకోసాగింది.

మర్నాడు ఉదయం బాగా ఆలస్యంగా నిద్ర లేచింది ఆకాంక్ష. రాత్రంతా కూతురు చదువుతూనే వుంది కదా అని ఆమె తల్లి నిద్ర లేపలేదు. అప్పటికే కాలేజీ టైమ్ దగ్గర పడుతోంది. చకచకా పనులన్నీ ముగించుకుని హడావిడిగా బుక్స్ తీసుకుని బయలుదేరబోతున్న కూతురికి టిఫిన్ తానే తినిపించింది శారద. కాఫీ తాగటానికి టైమ్ లేదంటూ తల్లికి బై చెప్పి బయటపడే సరికి అదృష్టవశాత్తు బస్ రడీగా ఉంది.

ఖాళీగా వున్న సీట్లో కూర్చుని కండక్టర్‌కి టికెట్ డబ్బులివ్వబోతున్న ఆకాంక్ష మొహం తన ఎదుటి సీట్లో వున్న వ్యక్తిని చూడగానే చికాగ్గా మారిపోయింది.

ఏమిటీ దరిద్రం? ఎక్కడకు వెళ్ళినా వెంబడించటానికి సిగ్గులేదూ...! అయినా ఒకసారి ఛీ అంటే సిగ్గుతో దూరంగా పోవాలిగాని ఇలా వేదిస్తూ వెంటపడటం ఏ విధంగా భావ్యమో ఆమెకు అర్థం కావటం లేదు. బస్ దిగి తలదించుకుని విసవిసా నడుచుకుంటూ వెళ్తోంది ఆకాంక్ష. వెనుక నుంచి తనను వెంబడిస్తున్న విషయం తెలుస్తూనే ఉంది. ఏ విధంగా ఈ శాల్తీని వదిలించుకోవాలో అర్థం కావటం లేదు.

ముభావంగా ఫ్రెండ్స్‌ని విష్ చేసి లెక్చరర్ చెప్పే లెసన్ వినసాగింది. మనసంతా అల్లకల్లోలంగా ఉండటం వల్ల లెసన్ వినలేకపోతోంది. ఆలోచనలు ఆమె మనసుని ఒకచోట నిలవకుండా చేస్తూ ఆరు నెలల క్రితానికి తీసుకెళ్ళింది.

ఆ రోజు కాలేజీ అయిన తర్వాత తల దించుకుని ఫ్రెండ్స్‌తో ఏదో మాట్లాడుతూ క్రిందకు వస్తున్న ఆకాంక్ష అనుకోకుండా మెట్టు నుంచి తూలి పడబోయింది. అదే సమయంలో అటుగా వస్తున్న ఒక అపరిచిత వ్యక్తిపై పడబోయిన ఆకాంక్షను పడకుండా ఆపాడతను.

“ఓ... సారీ... అండీ” అంటూ మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ముందుకు వెళ్ళిపోయింది ఆమె. అయితే ఆ సంఘటన ఆ రోజుతోనే మరచిపోయింది ఆకాంక్ష.

అతను మాత్రం ఆమెను మరచిపోలేదు. మల్లెచెండులా మృదువుగా ఉన్న ఆమె స్పర్శ అతను మరచిపోలేక ఆమెవైపు ఆకర్షితుడయ్యాడు.

ఆ రోజు మొదలు ప్రతిరోజు ఆమెను గమనిస్తూ వీలున్నంత వరకు ఆమె కనులముందు కదలాడేవాడు అతను. మొదట్లో ఆకాంక్ష ఈ విషయం గమనించలేదు. క్రమంగా ఏదో అనుమానం కలిగి నిశితంగా అతన్ని అబ్జర్వ్ చేయటం మొదలు పెట్టింది.

ఆకాంక్ష తనను గమనిస్తోంది అనే విషయం తెలుసుకున్న అతను తనకు కావాల్సింది లభించేసరికి ధైర్యంగా ఆమెను పలకరించటం మొదలు పెట్టాడు.

మొదట్లో మర్యాదకోసం విష్ చేసిన ఆకాంక్ష క్రమంగా అతని ప్రవర్తనలో ఏదో తేడా గమనించింది. ఒకరోజు తను రాసిన కవితల పుస్తకం అని ‘మీరు చదివి అభిప్రాయం చెప్పండి’ అంటూ ఒక బుక్ ఇచ్చాడు.

తప్పనిసరి పరిస్థితిలో బుక్ అందుకున్న ఆకాంక్ష సాంతం ఆ పుస్తకం చదివేసరికి కోపంతో, అసహ్యంతో ఆమె మొహం జేవురించింది.

దాదాపుగా రెండు వందల పేజీలున్న ఆ బుక్ మొత్తం అంతా "ఆకాంక్ష అయ్ లవ్ యూ" అంటూ రామకోటిలా రాశాడు. ప్రతి పేజికి క్రిందన తన బయోడేటా ఇచ్చాడు. అతని పేరు 'నివాస్' అట. తను ఒక బిజినెస్‌మాన్ కొడుకట. ఆకాంక్ష ఒప్పకుంటే తన పెద్దలతో మాట్లాడి పెళ్ళి చేసుకుంటాడట.

మొదటిసారిగా స్త్రీ స్పర్శ అంటే ఎలా ఉంటుందో తన వల్లనే తెలిసిందట. ఆ రోజు మెట్ల మీద నుంచి తూలి పడబోయి పొరపాటున అతని మీద పడటం యాదృచ్ఛికంగా జరిగినప్పటికి ఆ సంఘటన, ఆ స్పర్శ ఇప్పటికీ మరచిపోలేక పోతున్నాడట. ఇక ఎప్పటికీ మరచిపోలేడట. అందువల్ల ఆకాంక్ష అంగీకరిస్తే ఆమెను తన జీవిత భాగస్వామిగా చేసుకుంటాడట. క్లుప్తంగా సారాంశం అది.

ఆకాంక్షకు ఇలాంటి సినిమా టైపు సంఘటనలపై నమ్మకం లేదు. అలాగే ప్రేమ పెళ్ళి మీద కూడా ఆమెకు సదభిప్రాయం లేదు. ఆమెకు ఏం కావాలో అన్నీ అమర్చి పెట్టేందుకు తల్లిదండ్రులు, ప్రాణంలా చూసునే అన్నయ్య ఉన్నారు.

"కేవలం అనుకోకుండా జరిగిన చిన్న యాక్సిడెంట్‌ని ఆధారంగా చేసుకుని నూరేళ్ళ జీవితాన్ని నిర్మించుకోవాలనుకోవటం అవివేకం". అందుకే చాలా సున్నితంగా చెప్పింది ఆకాంక్ష

"జీవితంలో చాలా సంఘటనలు అనుకోకుండా జరుగుతాయి. వాటిని పట్టించుకుంటూ పోతే జీవితం దుర్భరంగా మారుతుంది. అనుకోకుండా నేను తూలి పడబోతే  పడిపోకుండా మీరు సహాయం చేసారు. అంతే తప్ప జీవితం అంటే 'తొలిస్పర్శ'లోనే ఏదో ఉందనుకుని ప్రేమించటం పెళ్ళి చేసుకోవటం ఇది కాదు. మీరు చాలా టెన్షన్‌లో ఉన్నారు. నిదానంగా ఆలోచించండి. ఏమీ ఉండదు. ప్లీజ్ నన్ను డిస్టర్బ్ చేయకండి" అంటూ అతనిచ్చిన బుక్ అతనికే తిరిగి ఇచ్చేసింది.

ఆకాంక్ష అంత క్లియర్‌గా చెప్పినా అర్థం చేసుకోలేదు నివాస్. ప్రతిరోజు ఆమె వెంటపడి వేదిస్తూనే ఉన్నాడు. మొదట్లో మర్యాదగా నచ్చచెప్పటానికి ప్రయత్నించిన ఆమె విసిగిపోయి పరుషంగా మాట్లాడుతూ అతన్ని చీదరించుకోసాగింది.

ఆకాంక్ష ఎన్ని విధాలుగా చెప్పినా నివాస్ పద్ధతి మార్చుకోవటం లేదు. పోనీ విషయం ఇంట్లో చెబుదామా అంటే అనవసరంగా పబ్లిక్‌లో సమస్యనుఎదుర్కోవలసి వస్తుందని ఆలోచించసాగింది ఆమె. ముభావంగా ఉంటున్న ఆకాంక్షను ఫ్రెండ్స్ అడిగారు "ఏయ్ లవ్‌లో పడ్డావా...!" అంటూ.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Aakanksha**

* * *